ప్రజల ఆకాంక్షలకు అద్దం పట్టే మేనిఫెస్టో

మాలాంటి వారికి ఎంతో ఉపయోగం



ప్రభుత్వం అందించే సంక్షేమ పథకాలు మాలాంటి వారికి ఎంతో ఉపయోగం. అమ్మ ఒడి పథకం ద్వారా అందించిన నగదు మా పిల్లల ఖర్చులకు ఎంతగానో ఉపయోగపడ్డాయి. మాలాంటి పేద, మధ్యతరగతి వాళ్లను దృష్టిలో ఉంచుకుని అమ్మ ఒడి సాయం రూ.17 వేలకు పెంచడం సంతోషంగా ఉంది. పెన్షన్ సొమ్ము కూడా పెంచడంతో వృద్ధులు, వితంతువులు ఇతరులపై ఆధారపడకుండా గౌరవంగా జీవనం సాగిస్తారు.

– ఉమాదేవి, లేబర్ కాలనీ, ఆదోని

చంద్రబాబు హామీలన్నీ మోసమే



ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ఇచ్చిన మేనిఫెస్టో అన్ని వర్గాల ప్రజలకు మేలు చేసేలా ఉంది. ఎన్నికల్లో గెలవలేమని తెలిసే టీడీపీ అధినేత చంద్రబాబు లెక్కలేనన్ని హామీలు ఇస్తున్నారు. గతంలో చంద్రబాబు అధికారంలో ఉన్నప్పుడు ఎలాంటి హామీలు నెరవేర్చలేదు. ఇప్పుడు మరోసారి ప్రజలను మోసగించేందుకు ఉమ్మడి మేనిఫెస్టో అంటూ వస్తున్నారు. జగనన్న అమలు చేయగలిగే పథకాలను మాత్రమే ప్రకటిస్తారనే నమ్మకం ఉంది. వైఎస్సార్‌సీపీ మేనిఫెస్టో చాలా బాగుంది.

– బోయ రంగన్న, టీఎస్ కూళ్లూరు

ప్రజలకు మేలు చేసేలా పథకాలు



మేనిఫెస్టోలో అన్ని వర్గాల ప్రజల సంక్షేమానికి పెద్దపీట వేశారు. నెరవేర్చగలిగే హామీలనే పేర్కొన్నారు. మహిళల కోసం వైఎస్సార్ చేయూత, చేనేతలను ఆదుకునేందుకు నేతన్న నేస్తం పథకాలు అమలు చేయడం హర్షణీయం. పింఛన్ల పెంపు, అమ్మఒడి, రైతు భరోసా, వాహన మిత్ర ఆర్థిక సాయాన్ని పెంచడం ద్వారా ఆయా వర్గాలకు ఎంతో మేలు జరుగుతుంది. యువతకు ఉపాధి అవకాశాల కోసం స్కిల్ డెవలప్‌మెంట్, వైఎస్సార్ కాపునేస్తం, ఈబీసీ నేస్తం, వైఎస్సార్ ఆసరా కింద సున్నా వడ్డీ రుణాలు రూ.3 లక్షల వరకు పెంపు, పెండింగ్ ప్రాజెక్ట్‌లను పూర్తికి హామీ ఇవ్వడం ఆనందదాయకం. సంక్షేమ మేనిఫెస్టోను రూపొందించిన వైఎస్సార్‌సీపీకి ప్రజలు పట్టం కట్టడం ఖాయం. – బుట్టా రేణుక, ఎమ్మిగనూరు ఎమ్మెల్యే అభ్యర్థి



పేదలకు ప్రాణవాయువు



పేదలకు ప్రాణవాయువు లాంటి మేనిఫెస్టోను ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ప్రకటించారు. సకల వర్గాల అభ్యున్నతికి అద్దం పట్టేలా పథకాలను రూపొందించారు. గతంలో కంటే అధికంగా పథకాలు ఉన్నాయి. సీఎం జగన్ మేనిఫెస్టోను భగవద్గీత, ఖురాన్, బైబిల్‌గా భావిస్తారు. పేర్కొన్న హామీలన్నీ నెరవేర్చి తీరతారు. ప్రస్తుత పాలనే ఇందుకు నిదర్శనం. మేనిఫెస్టోలో పేదల జీవన ప్రమాణాల పెంపునకు బీజం వేశారు. ముఖ్యంగా రూ.25 వేలలోపు జీతాలు తీసుకునే ప్రభుత్వ ఉద్యోగులకు సంక్షేమ పథకాలు వర్తింపజేయడం దేశ చరిత్రలోనే ప్రథమం. సీఎం జగనన్నకు పేదలపై ఎంత ప్రేముందో మేనిఫెస్టోను చూస్తేనే అర్థమవుతోంది. టీడీపీ నాయకులు తలకిందులుగా తపస్సు చేసినా ఇలాంటి మేనిఫెస్టోను రూపొందించడం సాధ్యం కాదు.

– ఎమ్మెల్యే వై.బాలనాగిరెడ్డి, మంత్రాలయం

మేనిఫెస్టోపై అపారమైన నమ్మకం



సీఎం జగనన్న విడుదల చేసిన మేనిఫెస్టోపై ప్రజలకు అపారమైన నమ్మకం. ప్రతిపక్ష నేత చంద్రబాబు సూపర్ సిక్స్ అంటూ ఎన్ని పథకాలను ప్రవేశపెట్టినా ప్రజలు నమ్మే పరిస్థితి లేదు. సంక్షేమ పథకాల వల్ల ఆంధ్రప్రదేశ్ మరో శ్రీలంక అవుతుందని గగ్గోలు పెట్టిన చంద్రబాబు ఇప్పుడు లెక్కనేనన్ని అమలుచేయలేని హామీలన్నీ ఇస్తున్నారు. ఆయన మాటలు ఎవరూ నమ్మే పరిస్థితి లేదు. ప్రభుత్వం విడుదల చేసిన మేనిఫెస్టో బడుగు బలహీన వర్గాల జీవితాలను మార్చేలా ఉంది.

– అంజినయ్య, ఆదోని

ప్రతిఒక్కరూ చదువుకుంటారు



నా కూతురు ప్రభుత్వ పాఠశాలలో చదువుతోంది. జగనన్న పాలనలో పాఠశాలలో అన్ని సౌకర్యాలు కల్పించారు. ఉచితంగా పుస్తకాలు, యూనిఫాం, బ్యాగు ఇచ్చారు. అమ్మ ఒడి సాయం అందించడం మా కుటుంబానికి ఎంతగానో ఉపయోగపడింది. ఇప్పుడు సాయం రూ.17 వేలకు పెంచడంతో బిడ్డ చదువుకు భరోసా కలిగింది. పేద పిల్లల చదువుల కోసం ముఖ్యమంత్రి ఎన్నో పథకాలు అందిస్తున్నారు. ఇలాంటి పథకాల వల్ల ప్రతిఒక్కరూ చదువుకుంటారు.

– ఆఫ్రిన్, కౌతాళం

జగనన్నంటే నమ్మకం



నేను పొదుపు గ్రూపులో దాదాపు 20 ఏళ్ల నుంచి ఉన్నాను. లోన్ తీసుకుని సక్రమంగా వడ్డీ చెల్లిస్తున్నా. జగనన్న ప్రభుత్వం వచ్చాక నాలుగు విడుతల్లో రుణ మాఫీ చేశారు. మా గ్రూపునకు నాలుగు విడతల్లో రూ.4.20 లక్షలు రుణమాఫీ జరిగింది. అందుకే మాకు జగనన్న అంటే నమ్మకం. కొత్త మేనిఫెస్టోలో రూ.3 లక్షల వరకు సున్నా వడ్డీ వర్తింపజేస్తూ ప్రకటన చేయడం సంతోషంగా ఉంది.

– గొల్ల పార్వతి, ఉషా పొదుపు గ్రూపు, పెద్దకొత్తిలి

785 గ్రాముల బంగారం స్వాధీనం



వివరాలు వెల్లడిస్తున్న ట్రైనీ డీఎస్పీ ధీరజ్

ఆదోని అర్బన్: ఆదోని పట్టణంలోని ఎంఎం రోడ్డు గీతా మార్కెట్ సర్కిల్ వద్ద ఓ వ్యక్తి అనుమానాస్పదంగా తచ్చాడుతుండగా ట్రైనీ డీఎస్పీ వి.ధీరజ్, వన్‌టౌన్ సీఐ తేజమూర్తి ఆధ్వర్యంలో పోలీసులు అదుపులోకి తీసుకున్నారు. ఆ వ్యక్తి వద్ద 785.4446 గ్రాముల బంగారాన్ని గుర్తించి స్వాధీనం చేసుకున్నట్లు ట్రైనీ డీఎస్పీ తెలిపారు. ఆ వ్యక్తి ముంబైకి చెందిన డానియల్ జైన్‌గా గుర్తించినట్లు చెప్పారు. ఈ బంగారం ఎక్కడి నుంచి తరలిస్తున్నారు, ఎవరికి చేర్చాలన్న దానిపై విచారణ చేస్తున్నట్లు తెలిపారు. పట్టుబడిన బంగారం విలువ రూ.50,13,508 ఉంటుందని చెప్పారు. పోలీసుల సమక్షంలో పంచనామా చేసి సీజ్ చేసినట్లు చెప్పారు. దాడుల్లో ఎఫ్ఎస్టీ బృందం బి.హరేంద్ర, జి.జనార్దన్ పాల్గొన్నారు.

నేడు చంద్రబాబు రాక

కౌతాళం: ఎన్నికల ప్రచారంలో భాగంగా మాజీ ముఖ్యమంత్రి చంద్రబాబునాయుడు ఆదివారం కౌతాళంకు వస్తున్నట్లు తెలుగుదేశం పార్టీ జిల్లా అధ్యక్షుడు తిక్కారెడ్డి తెలిపారు. ఈ మేరకు శనివారం హెలిప్యాడ్ కోసం కౌతాళంలోని జెడ్పీ పాఠశాల గ్రౌండ్‌లో స్థలాన్ని సీఐ ప్రసాద్, ఎస్ఐ నరేంద్రకుమార్‌రెడ్డితో కలిసి పరిశీలించారు. సాయంత్రం ఆర్టీసీ బస్టాండ్ వద్ద చంద్రబాబునాయుడు ప్రచారంలో పాల్గొంటారని వెల్లడించారు.

క్లుప్తంగా

వరదేంద్రతీర్థుల ఆరాధన



వరేంద్రతీర్థుల మూల బృందావనానికి అభిషేకం చేస్తున్న పీఠాధిపతి సుబుధేంద్రతీర్థులు

మంత్రాలయం: మధ్వమత పూర్వపు పీఠాధిపతి వరదేంద్రతీర్థుల మధ్యారాధన వేడుక కనుల పండువగా సాగింది. శనివారం శ్రీమఠం పీఠాధిపతి సుబుదేంద్రతీర్థులు నేతృత్వంలో కర్ణాటకలోని గంగావతి నియోజకవర్గం ఆనెగుందిలోని నవ బృందావన క్షేత్రంలో ఆరాధన వేడుకలు చేపట్టారు. మధ్యారాధన సందర్భంగా వరదేంద్ర తీర్థుల మూలబృందావనానికి విశేష పంచామృతాభిషేకం, పుష్పార్చనలతో మంగళహారతులు పట్టారు. అనంతరం భక్తులకు పీఠాధిపతి అనుగ్రహ సందేశం ఇచ్చారు. అనంతరం మూల రామ, జయ, దిగ్విజయ రాముల సంస్థాన పూజలో తరించారు.

గొడవలు సృష్టిస్తే కఠిన చర్యలు



కౌన్సెలింగ్ ఇస్తున్న రూరల్ సీఐ మోహన్‌రెడ్డి

ఎమ్మిగనూరురూరల్: సార్వత్రిక ఎన్నికల నేపథ్యంలో ఎవరైనా గొడవలు సృష్టించాలని చూస్తే కఠిన చర్యలు తీసుకుంటామని రూరల్ సీఐ మోహన్‌రెడ్డి హెచ్చరించారు. ఆయన శనివారం సర్కిల్ కార్యాలయంలో వివిధ పార్టీలకు చెందిన నాయకులకు కౌన్సెలింగ్ ఇచ్చారు. ఎన్నికలు ప్రశాంతంగా జరిగేందుకు ప్రతిఒక్కరూ సహకరించాలని కోరారు. నిబంధనల మేరకు ఎన్నికల ప్రచారం చేసుకోవాలని సూచించారు. రూరల్ ఎస్ఐ శరత్‌కుమార్‌రెడ్డి తదితరులు ఉన్నారు.

వలంటీర్ల రాజీనామా

ఆదోని టౌన్: ఆదోని మున్సిపాలిటీ పరిధిలోని 20 మంది వార్డు వలంటీర్లు తమ పదవులకు రాజీనామా చేశారు. ఈ మేరకు శనివారం రాజీనామా పత్రాలను సచివాలయాల అడ్మిన్‌లకు అందజేశారు. రాజీనామాల ఆమోదం కోసం మున్సిపల్ కమిషనర్‌కు సిఫారసు చేశామని వార్డు అడ్మిన్లు తెలిపారు. వ్యక్తిగత కారణాలతో రాజీనామా చేస్తున్నట్లు వారు పేర్కొన్నారు.

ఆదోని రూరల్: మండిగిరి సచివాలయం–2 పరిధిలోని ఏడుగురు వలంటీర్లు శనివారం రాజీనామా చేశారు. రాజీనామా పత్రాలను ఇన్‌చార్జ్ ఎంపీడీఓ విజయశేఖరరావు, పంచాయతీ సెక్రటరీ చంద్రశేఖర్‌లకు అందజేశారు. తమపై ప్రతిపక్ష పార్టీల నాయకులు చేసిన ఆరోపణలకు ఆవేదనతో రాజీనామా చేసినట్లు వారు చెప్పారు.

రైలు ఢీకొని గుర్తు తెలియని యువకుడి మృతి



ఆదోని సెంట్రల్: ఆదోని రైల్వే స్టేషన్ పరిధిలోని కిలోమీటర్ నంబర్ 494/3-1 వద్ద రైలు ఢీకొని గుర్తు తెలియని యువకుడు మృతి చెందాడు. శనివారం యువకుడు రైల్వే ట్రాక్ దాటుతుండగా గూడ్స్ రైలు ఢీకొట్టడంతో ట్రాక్ మధ్య లోపడి చనిపోయినట్లు రైల్వే ఎస్ఐ గోపాల్, హెడ్ కానిస్టేబుల్ సర్వేశ్వరరావు తెలిపారు. యువకుడి వయసు 25 ఏళ్లు ఉంటుందని, ఎడమచేతిపై అమ్మ అని తెలుగులో, మమ్మీ డాడీ అని ఇంగ్లిష్‌లో పచ్చబొట్టు ఉందన్నారు. మెడలో ఆంజనేయ స్వామి డాలర్ చైన్ ఉన్నట్లు తెలిపారు. మృతుడి ఆచూకి తెలిసిన తమను సంప్రదించాలన్నారు.


జగనన్నతోనే రాష్ట్ర భవిష్యత్తు



గోనెగండ్లలో ప్రచారం చేస్తున్న బుట్టా ప్రతుల్

గోనెగండ్ల: గత ఎన్నికల సమయంలో ఇచ్చిన హామీలన్నీ నెరవేర్చిన ఘనత సీఎం వైఎస్ జగన్ మోహన్ రెడ్డికే దక్కిందని వైఎస్సార్‌సీపీ యువ నాయకుడు బుట్టా ప్రతుల్ కొనియాడారు. ఆయన శనివారం గోనెగండ్లలో వైఎస్సార్‌సీపీ నాయకులు, కార్యకర్తలతో కలిసి మొట్టివీధి, ఒంటయ్య గేరి, అల్లబండ గేరి తదితర వీధుల్లో ఇంటింటి ప్రచారం చేపట్టారు. సంక్షేమ పథకాలు కొనసాగాలంటే మళ్లీ వైఎస్సార్‌సీపీ ప్రభుత్వం అధికారంలోకి రావాలని అందుకు ఫ్యాన్ గుర్తుకు ఓటు వేయాలని అభ్యర్థించారు. నాయకులు బందెనవాజ్, దొరబాబు, మురళినాయుడు,గోవింద్, తిక్కయ్యస్వామి తదితరులు పాల్గొన్నారు.

ప్రతి గడపకు సంక్షేమం



ఉప్పరహాల్‌లో ప్రచారం చేస్తున్న ప్రదీప్ రెడ్డి

కౌతాళం: ప్రతి గడపకు సంక్షేమం అందించడంతో పాటు రాష్ట్ర అభివృద్ధికి చిరునామాగా మారిన వైఎస్సార్‌సీపీని మరోసారి ఆదరించాలని ఆ పార్టీ రాష్ట్ర యువజన విభాగం నాయకుడు ప్రదీప్‌రెడ్డి, సింగిల్ విండో అధ్యక్షుడు దాట్ల కృష్ణంరాజు విన్నవించారు. ఉప్పరహాల్ గ్రామంలో శనివారం యువజన నాయకుడు మహేంద్రరెడ్డి, ఎంపీపీ అమరేష్, గ్రామ ఇన్‌చార్జ్ ఏకాంబర్‌రెడ్డి, సర్పంచ్ తులసితో కలిసి ఇంటింటికీ తిరిగి వైఎస్సార్‌సీపీ గుర్తు ఫ్యాన్‌కు ఓటు వేయాలని అభ్యర్థించారు. ముఖ్యమంత్రి వైఎస్ జగన్ ఐదేళ్ల పాలనలో ప్రజా సంక్షేమం కోసం ఎన్నో పథకాలను అమలు చేశారని గుర్తుచేశారు. మంత్రాలయం అభివృద్ధికి బాలనాగిరెడ్డిని ఎమ్మెల్యేగా గెలిపించుకుందామని పిలుపునిచ్చారు. నాయకులు సుబ్బరాజు, రాఘవేంద్రరెడ్డి, తదితరులు పాల్గొన్నారు.

ఆదర్శ పాలనకు నిదర్శనం సీఎం జగనన్న



రోడ్ షోలో మాట్లాడుతున్న ఎమ్మెల్యే అభ్యర్థి బుట్టా రేణుక

నందవరం: దేశంలోనే ఆదర్శ పరిపాలనకు సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి నిదర్శనంగా నిలిచారని వైఎస్సార్‌సీపీ ఎమ్మెల్యే అభ్యర్థి బుట్టా రేణుక ఉద్ఘాటించారు. ఆమె శనివారం నందవరం మండలం మాచాపురం, పూలచింత, సాయంత్రం మిట్టసోమపురం, కే.పేట, కనకవీడు గ్రామాల్లో రోడ్ షో నిర్వహించారు. ఆమె మాట్లాడుతూ.. సంక్షేమ పథకాలు నిర్విరామంగా కొనసాగాలంటే మళ్లీ సీఎంగా జగనన్నను గెలిపించుకోవాలని పిలుపునిచ్చారు. జగనన్న పాలనలో సంక్షేమ పథకాల ద్వారా ప్రతి కుటుంబానికి లబ్ధి చేకూరిందని వివరించారు. నవరత్నాలు ప్రధాన ఎజెండా చేసుకుని 99 శాతం హామీలను నెరవేర్చారని గుర్తుచేశారు. సంక్షేమ పాలన అందించిన ముఖ్యమంత్రి వైఎస్ జగనన్నకు మరోసారి అండగా నిలవాలని కోరారు. సార్వత్రిక ఎన్నికల్లో రెండు ఓట్లు (ఎమ్మెల్యే, ఎంపీ) ఫ్యాన్ గుర్తుకు వేయాలని అభ్యర్థించారు. అబద్ధపు హామీలు ఆయన చేతకాదని వివరించారు. మాట మీద నిలబడే జగనన్నను మరోసారి ముఖ్యమంత్రిగా గెలిపించుకుందామని పిలుపునిచ్చారు. వైఎస్సార్‌సీపీ నాయకులు శివారెడ్డిగౌడ్, విరుపాక్షిరెడ్డి, పేట శ్రీనివాసరెడ్డి, కిష్టప్ప, మద్దీశ్వరి, మద్రి అగ్నేశమ్మ, షేక్‌సాహెబ్, సరస్వతి తదితరులు పాల్గొన్నారు.

వైఎస్సార్‌సీపీతో సుపరిపాలన : బీఆర్ బసిరెడ్డి

ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి అందించిన సుపరిపాలనతో ప్రతి ఇంటికీ సంక్షేమం చేరిందని వైఎస్సార్‌సీపీ సీనియర్ నాయకులు బీఆర్ బసిరెడ్డి పేర్కొన్నారు. ఆయన రోడ్‌షోలో మాట్లాడుతూ.. అమ్మ ఒడి, వైఎస్సార్ రైతు భరోసా, వైఎస్సార్ చేయూత, వైఎస్సార్ ఆసరా, జగనన్న చేదోడు పథకాలు దేశానికే ఆదర్శంగా నిలిచాయన్నారు. ఆర్థిక సంక్షోభాన్ని అధిగమిస్తూనే ప్రజల శ్రేయస్సుకు అహర్నిశలు పాటు పడుతున్నారన్నారు. గ్రామ సచివాలయ వ్యవస్థతో ప్రజల వద్దకు పాలన తీసుకొచ్చారన్నారు.

సంక్షేమ పథకాలే గెలిపిస్తాయి : లక్ష్మీకాంత రెడ్డి

పేదల అభ్యున్నతికి సీఎం జగనన్న అమలు చేసిన సంక్షేమ పథకాలే మరోసారి వైఎస్సార్‌సీపీ గెలుపునకు నాంది అని ఆ పార్టీ జిల్లా ప్రధాన కార్యదర్శి లక్ష్మీకాంతరెడ్డి పేర్కొన్నారు. ఆయన మాట్లాడుతూ.. సంక్షేమ పథకాలు పొందిన ప్రతి కుటుంబం ఫ్యాన్ గుర్తుకు ఓటు వేసేందుకు సిద్ధంగా ఉందన్నారు. టీడీపీ హామీలను నమ్మి మోసపోవద్దని సూచించారు. జగనన్న చెప్పారంటే చేసి తీరతారని, అబద్ధపు హామీలు ఆయన చేతకాదని వివరించారు. మాట మీద నిలబడే జగనన్నను మరోసారి సీఎంను చేసుకుందామన్నారు.

స్వర్ణకారుల జీవితాల్లో వెలుగులు నింపుతాం



స్వర్ణకారుల సమావేశంలో మాట్లాడుతున్న బుట్టా రేణుక

ఎమ్మిగనూరుటౌన్: స్వర్ణకార కార్మికుల పని బంగారమైనా వారి జీవితాలు కష్టాలమయం అని, ఆయా కార్మికుల జీవితాల్లో వెలుగులు నింపేందుకు కృషి చేస్తానని బుట్టా రేణుక పేర్కొన్నారు. పట్టణంలోని బాబు ఫంక్షన్ హాల్‌లో మున్సిపల్ వైస్‌చైర్మన్ నజీర్ అహమ్మద్, మైనారిటీ సెల్ జిల్లా ఉపాధ్యక్షుడు ముల్లా రసూల్ ఆధ్వర్యంలో పట్టణంలోని స్వర్ణకారులతో నిర్వహించిన ఆత్మీయ సమ్మేళనంలో ఆమె మాట్లాడారు. బంగారు ఆభరణాల తయారీలో కార్పొరేట్ రంగాలు పోటీ పడి కొత్త మోడళ్లతో రెడీమేడ్ ఆభరణాలు తయారు చేస్తుండటంతో స్వర్ణకారులకు పనులు లేకుండా పోయాయన్నారు. స్వర్ణకారుల సమస్యను ప్రభుత్వం దృష్టికి తీసుకెళ్లి పరిష్కారానికి కృషి చేస్తానని హామీ ఇచ్చారు. సబ్సిడీ రుణాలు, ఆర్థిక సాయంతో పాటు ఇళ్ల స్థలాల మంజూరుకు కృషి చేస్తానని తెలిపారు. స్వర్ణకార్మిక సంక్షేమ సంఘ అధ్యక్షుడు ముల్లా మహబుబ్, నాయకులు సూర్యనారాయణ, ఈరన్న, ముస్తక్, ఉస్మాన్, మునీరుద్దీన్, మగ్బుల్, రఫీక్‌అహమ్మద్, ఇక్బాల్ తదితరులు పాల్గొన్నారు.

వైఎస్సార్‌సీపీలో చేరికల వెల్లువ



వైఎస్సార్‌సీపీలో చేరిన చిన్ననేలటూరు టీడీపీ ఎంపీటీసీ ఈరమ్మ తదితరులు



కనకవీడు ఈరన్నకు పార్టీ కండువా కప్పుతున్న బుట్టా రేణుక

ఎమ్మిగనూరుటౌన్: స్థానిక వైఎస్సార్‌సీపీ కార్యాలయంలో ఎమ్మెల్యే అభ్యర్థి బుట్టారేణుక, బుట్టా శివనీలకంఠ సమక్షంలో పార్టీ జిల్లా కార్యదర్శి లక్ష్మీకాంతారెడ్డి, నందవరం మండల కన్వీనర్ శివప్పగౌడ్‌ల ఆధ్వర్యంలో కనకవీడు గ్రామానికి చెందిన పెద్ద ఈరన్న, చిన్న ఈరన్న, జగన్నాథ్, మల్లికార్జునతో పాటు 300 మంది ఆ పార్టీలో చేరారు. అలాగే గోనెగండ్ల మండలం చిన్ననేలటూరుకు చెందిన టీడీపీ ఎంపీటీసీ భక్తుల ఈరమ్మ వైఎస్సార్‌సీపీలో చేరారు. మండల కోఆప్షన్ సభ్యుడు డీఎంఎస్ రవూఫ్ ఆధ్వర్యంలో ఎంపీటీసీతో పాటు భక్తుల పరమేష్, గొల్ల గోపాల్,వెంకటేష్, పి.మునిస్వామి, రాముడులతో పాటు మరో 80 మంది ఆ పార్టీలో చేరగా వారికి బుట్టా రేణుక కండువాలు కప్పి ఆహ్వానించారు.

నివాళి: అనారోగ్యంతో మృతిచెందిన వీరశైవ లింగాయత్ సంఘటిత పరిషత్ రాష్ట్ర అధ్యక్షుడు వై.దేవేంద్రగౌడ్ భౌతిక కాయానికి పట్టణంలోని ఆయన నివాసంలో బుట్టా రేణుక, సీనియర్ నాయకుడు ఎర్రకోట జగన్‌మోహన్‌రెడ్డితో పాటు పలువురు నివాళులర్పించారు. ఆ కుటుంబ సభ్యులకు ప్రగాఢ సానుభూతి తెలిపారు.

వైఎస్సార్‌సీపీతోనే వాల్మీకులకు ప్రాధాన్యత



కుప్పగల్ రోడ్ షోలో మాట్లాడుతున్న ఎమ్మెల్యే సాయిప్రసాద్‌రెడ్డి, పక్కన ఎంపీ అభ్యర్థి బీవై రామయ్య

ఆదోని రూరల్: ప్రజలు ఏమి చేస్తారో చెప్పకుండా, స్థానిక ఎమ్మెల్యే సాయిప్రసాద్‌రెడ్డిని తిడుతూ పోతున్న బీజేపీ అభ్యర్థి పార్థసారథికి ఎలాంటి ఓట్లు పడవని వైఎస్సార్‌సీపీ కర్నూలు ఎంపీ అభ్యర్థి బీవై రామయ్య స్పష్టం చేశారు. ఈ మేరకు శనివారం రాత్రి మండలంలోని కుప్పగల్, బల్లేకల్ గ్రామాల్లో ఆదోని ఎమ్మెల్యే సాయిప్రసాద్‌రెడ్డితో కలిసి ఎంపీ అభ్యర్థి బీవై రామయ్య మాట్లాడారు. ప్రస్తుతం సీఎం జగనన్న విడుదల చేసిన మేనిఫెస్టోతో ప్రజల నుంచి హర్షాతిరేకాలు వ్యక్తమవుతున్నాయన్నారు. ప్రజా మద్దతు ఎప్పటికీ వైఎస్సార్‌సీపీకే ఉంటుందన్నారు. గతంలో చంద్రబాబునాయుడు 600 హామీలిచ్చి అధికారం చేపట్టాక అమలుచేయకుండా ప్రజలను మోసం చేశాడన్నారు. సీఎం జగన్‌మోహన్‌రెడ్డి ఎలాంటి అవినీతికి తావులేకుండా వివిధ సంక్షేమ పథకాల కోట్లాది రూపాయలను పేదల ఖాతాలో జమ చేశారని గుర్తుచేశారు. మేనిఫెస్టోలో ఇచ్చిన హామీలన్నింటినీ నెరవేర్చారని వివరించారు. ఎన్నికల్లో వైఎస్సార్‌సీపీ గుర్తు ఫ్యాన్‌పై ఓటు వేసి ఆశీర్వదించాలని కోరారు. ఎమ్మెల్సీ డాక్టర్ మధుసూదన్, నాయకులు చంద్రకాంత్‌రెడ్డి, మనోజ్‌రెడ్డి, గురునాథ్‌రెడ్డి, గోవర్ధన్ రెడ్డి, నాగిరెడ్డి తదితరులు పాల్గొన్నారు.

వైఎస్సార్‌సీపీతోనే మహిళాభ్యున్నతి



18వ వార్డులో ప్రచారం చేస్తున్న బుట్టా సాహితి

ఎమ్మిగనూరుటౌన్: ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డితోనే మహిళాభ్యున్నతి సాధ్యమని వైఎస్సార్‌సీపీ ఎమ్మెల్యే అభ్యర్థి బుట్టారేణుక కోడలు సాహితి పేర్కొన్నారు. ఆమె శనివారం పట్టణంలోని 18వ వార్డులో ఉదయం, 24వ వార్డులో సాయంత్రం వార్డు ఇన్‌చార్జులు సోమేష్, కౌన్సిలర్ రామాంజినమ్మ, రుద్రాక్షాల బజారిలతో కలిసి ఇంటింటికీ వెళ్లి ప్రచారం చేశారు. ప్రభుత్వం అమలుచేసిన సంక్షేమ పథకాలతో ప్రతి కుటుంబానికి లబ్ధి చేకూరిందని వివరించారు. టీడీపీ నాయకుల మాటలు నమ్మి మోసపోవద్దని సంక్షేమ సారథి సీఎం జగనన్నకు మరోసారి పట్టం కట్టాలని పిలుపునిచ్చారు. ఫ్యాన్ గుర్తుకు ఓటు వేసి ఎమ్మెల్యేగా బుట్టా రేణుకను గెలిపించాలని కోరారు. కౌన్సిలర్ వాహిద్, కోఆప్షన్ మెంబర్ అబ్రార్, ఫయాజ్, మాచాని రఘు తదితరులు పాల్గొన్నారు.

విస్తృతంగా ఎన్నికల ప్రచారం



ఇంటింటి ప్రచారం చేస్తున్న గౌతమిరెడ్డి

ఆదోని టౌన్: పట్టణంలోని 34వ వార్డులో వైఎస్సార్‌సీపీ శ్రేణులు విస్తృత ప్రచారం చేశారు. ఎమ్మెల్యే సాయిప్రసాద్‌రెడ్డి తనయుడు మనోజ్‌కుమార్‌రెడ్డి, కుమార్తె గౌతమిరెడ్డి ఇంటింటికీ తిరుగుతూ వైఎస్సార్‌సీపీ ప్రభుత్వం చేసిన మేలును వివరించారు. ఫ్యాన్ గుర్తుపై ఓటు వేసి ఎంపీ బీవై రామయ్యను, ఎమ్మెల్యే సాయిప్రసాద్ రెడ్డిని అత్యధిక మెజార్టీతో గెలిపించాలని ఓటర్లను అభ్యర్థించారు. గత ఎన్నికల ముందు ఇచ్చిన హామీల్లో 99 శాతం నెరవేర్చి మళ్లీ మీ ముందుకు వచ్చిన సీఎం జగనన్నను మరోసారి ఆశీర్వదించాలని కోరారు. శనివారం ప్రకటించిన వైఎస్సార్‌సీపీ మేనిఫెస్టోలో రెట్టింపు స్థాయిలో ప్రజలకు మేలు చేసేలా పథకాలు ఉన్నాయన్నారు. మున్సిపల్ చైర్‌పర్సన్ బోయ శాంత, పట్టణాధ్యక్షుడు దేవా, నాయకులు వెంకటేశ్వరరెడ్డి, చంద్రశేఖర్‌రెడ్డి, తాయన్న, సందీప్ రెడ్డి, మంజుల, శ్రీలక్ష్మి, సుగుణమ్మ, శోభలత తదితరులు పాల్గొన్నారు.

అధికారం కోసం పార్థు వెంపర్లాట



మాట్లాడుతున్న ఎమ్మెల్సీ డాక్టర్ మధుసూదన్

ఆదోని టౌన్: ఎమ్మెల్యే సాయిప్రసాద్‌రెడ్డిపై లేనిపోని ఆరోపణలు చేస్తే ఎన్నికల్లో తనకు ఓట్లు పడతాయనే అత్యాశతో బీజేపీ అభ్యర్థి డాక్టర్ పార్థసారథి వ్యవహరిస్తున్నారని ఎమ్మెల్సీ డాక్టర్ మధుసూదన్, వైఎస్సార్‌సీపీ పట్టణ గౌరవాధ్యక్షుడు చంద్రకాంత్‌రెడ్డి ఆరోపించారు. శనివారం ఎమ్మెల్యే నివాసంలో వారు మాట్లాడుతూ.. పార్థసారథి ప్రచారంలో ఎమ్మెల్యేను టార్గెట్ చేసి ప్రసంగాలు చేయడం చూస్తుంటే ఆయనకు ప్రజాదరణ లేదని స్పష్టమవుతోందన్నారు. ఎన్నికల అనంతరం ఆయన తట్టాబుట్టా సర్దుకొని సొంత జిల్లా చిత్తూరుకు వెళ్లాల్సి వస్తుందని చెప్పారు. పార్థసారథి వ్యవహారంపై ప్రజలు చీదరించుకుంటున్నారన్నారు. శవాలపై రాజకీయాలు చేసే పార్థసారథి ఇకనైనా తీరు మార్చుకోవాలని హితవుపలికారు. బీసీలకు చేవ లేదా అని మాజీ ఎమ్మెల్యే మీనాక్షి నాయుడు వ్యాఖ్యానించడం ఎంతవరకు సబబు అని చంద్రకాంత్‌రెడ్డి, ఎమ్మెల్సీ మధుసూదన్ ప్రశ్నించారు. కౌన్సిలర్ రామలింగేశ్వరయాదవ్, నాయకులు గోవర్ధన్‌రెడ్డి, లక్ష్మీకాంతరెడ్డి తదితరులు పాల్గొన్నారు.

టీడీపీ బోగస్ ప్రచారాన్ని నమ్మొద్దు



రోడ్‌షోలో మాట్లాడుతున్న ఎమ్మెల్యే బాలనాగిరెడ్డి



ఎమ్మెల్యే వై.బాలనాగిరెడ్డి ఆధ్వర్యంలో పార్టీలో చేరుతున్న వాల్మీకి కుటుంబాలు

మంత్రాలయం/కోసిగి: బీసీ పేరుతో టీడీపీ అభ్యర్థి ఎన్.రాఘవేంద్రారెడ్డి బోగస్ ప్రచారం చేస్తున్నారని ఎమ్మెల్యే వై.బాలనాగిరెడ్డి ఆరోపించారు. సార్వత్రిక ఎన్నికల్లో భాగంగా ఆయన శనివారం కోసిగి మండలం వందగల్లు నుంచి రోడ్‌షో ప్రారంభించారు. మండలంలోని వందగల్లు, నేల కోసిగి, జుమ్మాల దిన్నె, గొడగల్లు, దుద్ది, కోల్మాన్‌పేట, మూగలదొడ్డి, చిర్తనగల్, ఎస్.కొట్టాల గ్రామాల్లో పర్యటించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. 2009లో బీసీ వాల్మీకి నేత దళవాయి రామయ్య కాంగ్రెస్ తరఫున పోటీ చేస్తే రాఘవేంద్రరెడ్డి నాన్న ప్రజారాజ్యం పార్టీ తరఫున పోటీ చేశారని గుర్తు చేశారు. ఆరోజు రాఘవేంద్రరెడ్డి కుటుంబ సభ్యులు బీసీ వ్యక్తి రామయ్యకు ఎందుకు సపోర్టు చేయలేదని ప్రశ్నించారు. తాను గట్టెక్కేందుకు ఈ రోజు బీసీలంతా ఏకం కావాలంటూ రాఘవేంద్రా రెడ్డి ప్రచారం చేయడం హాస్యాస్పదమన్నారు. వైఎస్సార్‌సీపీలో అన్ని వర్గాలకు సమ ప్రాధాన్యత లభిస్తోందని చెప్పారు. వాల్మీకి నేత బీవై రామయ్యను ఎంపీ అభ్యర్థిగా పోటీలో నిలిపినట్లు గుర్తుచేశారు. అలాగే కోసిగి ఎంపీపీగా వాల్మీకి నేత పెండేకల్లు ఈరన్న, వైస్ ఎంపీపీ మాన్విలక్ష్మి, సింగిల్ విండో ప్రెసిడెంట్‌గా నాడిగేని నరసింహులు, పెద్ద కడబూరు జెడ్పీటీసీగా రాజేశ్వరి, ఎమ్మెల్సీగా మధుసూదన్, గ్రంథాలయ చైర్మన్‌గా సుభాస్ చంద్రబోస్ పదవులు అలంకరించారని వివరించారు. జగనన్న పాలనలో అత్యధికంగా పదవులు బీసీ వర్గాలకే కేటాయించారన్నారు. ఇవన్నీ తెలిసినా టీడీపీ నేతలు బీసీ పేరుతో బూటకపు ప్రచారం చేయడం తగదన్నారు. 14 ఏళ్లు సీఎంగా పనిచేసిన చంద్రబాబు పేద ప్రజల కోసం ఏమి చేశారో చెప్పాలని ప్రశ్నించారు. వైఎస్సార్‌సీపీ నాయకులు పి.మురళీమోహన్ రెడ్డి, బెట్టన గౌడ, ఈరన్న, మంగమ్మ, నాడుగేని నాగరాజు, శ్రీనివాస రెడ్డి, మహంతేష్ స్వామి, నరసింహులు, కాల్వ లక్ష్మయ్య, కొరవ అంజమ్మ, హనుమంతమ్మ తదితరులు పాల్గొన్నారు.

కోసిగి: మండల పరిధిలోని జంపాపురం గ్రామానికి చెందిన 35 కుటుంబాల సభ్యులు టీడీపీని వీడారు. శనివారం ఎమ్మెల్యే వై.బాలనాగిరెడ్డి ఆధ్వర్యంలో మండల ఇన్‌చార్జ్ మురళీమోహన్‌రెడ్డి సమక్షంలో వైఎస్సార్‌సీపీలో చేరారు. అలాగే మూగలదొడ్డి గ్రామంలో గట్టు రమేష్, దుర్గన్న తదితరులు, కోల్మాన్‌పేటకు చెందిన గుడిసె పెద్ద రామాంజినేయులు, నేలకోసిగికి చెందిన టీడీపీ నాయకుడు పశువుల ఈరన్న తదితరులు పార్టీలో చేరారు.

కర్ణాటక మద్యం స్వాధీనం

ఆదోని రూరల్: మండలంలోని బసాపురం, పెద్దహరివాణం చెక్‌పోస్టు వద్ద శనివారం అక్రమంగా కర్ణాటక మద్యాన్ని తరలిస్తున్న ఇద్దరిని అరెస్ట్ చేసినట్లు తాలూకా సీఐ నిరంజన్‌రెడ్డి తెలిపారు. నిందితులు బసాపురం ఎరుకుల మునిస్వామి, సంతెకూడ్లూరు బోయ నాగలక్ష్మిగా తెలిసిందని చెప్పారు. వారి వద్ద నుంచి 50 లీటర్ల నాటుసారా, 384 కర్ణాటక మద్యం ప్యాకెట్లను స్వాధీనం చేసుకున్నట్లు వెల్లడించారు.

కోసిగి: మండల కేంద్రంలో సెబ్ సీఐ మహబూబ్ బాషా, ఎస్ఐ రమేష్‌బాబు నేతృత్వంలో అనుమానితుల ఇళ్లలో సోదాలు చేయగా జి.రమేష్ ఇంట్లో 109 మద్యం ప్యాకెట్లు లభించడంతో అతన్ని అరెస్ట్ చేశారు. సెబ్ పరిధిలో పట్టుబడిన 313 లీటర్ల అక్రమ మద్యంను ధ్వంసం చేసినట్లు వారు వివరించారు.

మంత్రాలయం: స్థానిక ఎస్ఐ గోపీనాథ్ నేతృత్వంలో తుంగభద్ర నదీ తీరంలో పోలీసులు గస్తీ చేపట్టి 324 కర్ణాటక మద్యం ప్యాకెట్లను స్వాధీనం చేసుకుని నిందితులను అదుపులోకి తీసుకున్నారు. నిందితులు కర్ణాటకలోని ఇడపనూరు మండలం గాణదాలకు చెందిన సన్న రామాంజినేయ, ఎమ్మిగనూరు మండలం పార్లపల్లి వాసి సవారన్నను అరెస్టు చేసి రిమాండ్‌కు తరలించినట్లు ఎస్ఐ వెల్లడించారు.

అనుమతి లేకుండా నగదు తరలిస్తే సీజ్

గోనెగండ్ల: ఇతర ప్రాంతాలకు నగదు తరలింపు విషయంలో అనుమతి తప్పనిసరి అని సీఐ రామకృష్ణయ్య అన్నారు. ఆయన శనివారం గాజులదిన్నె ప్రాజెక్ట్ స్టేజ్ క్రాస్ రోడ్డులో వాహనాలను తనిఖీ చేశారు. ఆయన మాట్లాడుతూ ఎన్నికల కోడ్ అమలులో ఉందని, నగదు తీసుకెళ్లే విషయంలో పరిమితులు విధించారన్నారు. ఎవరైనా రూ.50 వేల వరకు మాత్రమే తీసుకెళ్లవచ్చని, అంతకుమించి తీసుకెళ్లాలంటే అనుమతి పొందాలని, లేదంటే ఆ సొమ్మును సీజ్ చేస్తామన్నారు.

రెండు గడ్డివాములు దగ్ధం

ఆదోని రూరల్: మండలంలోని ధణాపురం గ్రామంలో రైతు మిఠాయి షడాక్షరప్పకు చెందిన రెండు గడ్డివాములకు ప్రమాదవశాత్తు నిప్పంటుకుంది. గ్రామస్తులు, ఫైర్ ఇంజన్ సిబ్బంది మంటలను అదుపుచేశారు. అప్పటికే గడ్డివాములు పూర్తిగా కాలిపోవడంతో రూ.2 లక్షల వరకు ఆస్తినష్టం వాటిల్లినట్లు బాధిత రైతు వాపోయారు.